క్లుప్తంగా

జూనియర్ సివిల్ జడ్జి బదిలీ

కాకినాడ లీగల్: జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు చేసింది. అందులో భాగంగా కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్న లక్ష్మిని బదిలీపై గుంటూరు జిల్లా మంగళగిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో శ్రీకాకుళం జిల్లా, ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.మణిని నియమించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఐదుగురికి 5 రోజులు చొప్పున జైలు, 14 మందికి రెండు రోజులు చొప్పున జైలు, 9 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో 28 మందిని హాజరుపర్చగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

హజ్ యాత్రికులూ.. టీకా వేయించుకోండి

కాకినాడ సిటీ: హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హాజ్ యాత్ర-2025కు వెళ్లేందుకు పేర్లు నమోదు చేసుకున్న వ్యక్తులు ఈనెల 28న బిలాల్ షాదీఖానా, నెహ్రూనగర్, రాజమహేంద్రవరంలో టీకా శిబిరంలో టీకా వేయించుకోవాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి వెళ్లే యాత్రికులు తప్పని సరిగా టీకా వేయించుకోవాలని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎం.సునీల్ కుమార్ తెలిపారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు

కాకినాడ రూరల్: స్థానిక కాకినాడ రూరల్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘ కమ్యూనిటీ హాల్‌లో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర గరగ నృత్య వాయిద్య కళాకారుల సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా పసుపులేటి సూరిబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా మాచవరపు వెంకటరమణ, సెక్రటరీగా అల్లవరపు గంగబాబు, గౌరవాధ్యక్షుడిగా వాడపల్లి ముసలయ్య, కోశాధికారిగా బండారి దుర్గారమేష్, సహాయకార్యదర్శిగా ద్రాక్షారపు ఆనంద్, కమిటీ సభ్యుల నూతన కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది.

విద్యార్థుల చదువుకు రూ.10 వేల విరాళం

బోట్‌క్లబ్: స్థానిక మధురానగర్‌లోని ప్రజా విద్యాలయలోని విద్యార్థులకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యురాలు దీపిక తన జన్మదినం సందర్భంగా మంగళవారం రూ.10 వేల విరాళం అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం భవా తదితరులు పాల్గొన్నారు.

మధుమేహాన్ని అదుపులో ఉంచాలి

కాకినాడ రూరల్: మధుమేహం దీర్ఘకాలిక వ్యాధి అని, దానిని అదుపులో ఉంచకపోతే శరీరాన్ని దెబ్బతీస్తూ ప్రాణాపాయ స్థితిలోకి నెడుతుందని రమణ క్రిమికల్ లేబరేటరీ అధినేత ఎల్.కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రమణ క్లినికల్ లేబరేటరీ సౌజన్యంతో మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో ఉత్పత్తి అయిన ఇన్సులిన్‌ను రక్తం సరిగ్గా గ్రహించకపోవడం వలన రక్తంలో గ్లూకోజ్ స్థాయి అధికమై మధుమేహానికి కారణం అవుతుందన్నారు. రక్తంలో చక్కెర మోతాదును బట్టి వైద్యులు మందులను సూచిస్తారని తెలిపారు. వాటిని వాడుతూ తగిన ఆహార నియమాలు పాటిస్తూ రోజుకు కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, న్యాయవాది యనమల రామం, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉజ్జయినీ మహంకాళి విగ్రహ ప్రతిష్ఠ

సామర్లకోట: మండల పరిధిలో నవర గ్రామంలో సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు దమ్మాల లక్ష్మణరావు, వీర నాగమణి దంపతులు ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో బుధవారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. సర్పంచ్ లక్ష్మణరావు విలేకర్లతో మాట్లాడుతూ ఈ మేరకు నవరత్న న్యాసం, నవధాన్యన్యాసం, యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ ఉంటాయన్నారు. వేదపండితుడు వింజమూరి సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సర్పంచ్ సూచించారు.

పఠనానికి వేళాయె

- గ్రంథాలయాలకు కొత్త శోభ
- అందుబాటులోకి 4,280 పుస్తకాలు
- వేసవి శిబిరాలకు సన్నద్ధం



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

బాలాజీచెరువు: గ్రంథాయాలు ఆధునిక దేవాలయాలంటూనే పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేసిన నేపథ్యంలో గ్రంథాలయాలను గత ప్రభుత్వ హయాంలో కొత్త పుస్తకాలతో కొత్త కళ తీసుకువచ్చారు. మరో వారం రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు రానున్నాయి. బుధవారం పాఠశాలలకు చివరి పనిదినం కాగా 24వ తేదీ నుంచి వేసవి సెలవులు రానున్నాయి. మళ్లీ జూన్ 12వ తేదీన పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలకు పుస్తకాల కొనుగోలులో భాగంగా ఉమ్మడి జిల్లాలో రూ.1.02 లక్షల నిధులతో లక్ష ఆరువేల పుస్తకాలు కనుగోలు చేశారు. వీటిని అన్ని గ్రంథాలయాలకు పంపిణీ చేయగా నగరంలోని ప్రధాన గ్రంథాలయంతో పాటు మూడు ఉప గ్రంథాలయాలకు, ఎనిమిది పుస్తక నిక్షిప్త కేంద్రాలకు సరఫరా చేశారు. ప్రధాన గ్రంథాలయంలో 1800, గాంధీనగర్ బ్రాంచ్‌కు 1820, జగన్నాథపురం శాఖకు 600, ఆనందభారతి గ్రౌండ్ గ్రంథాలయానికి 600 పుస్తకాలు పంపిణీ చేశారు. కొత్తగా వచ్చిన పుస్తకాలు చిన్నారులు, విద్యార్థులను కట్టిపడేస్తున్నాయి. సాయంత్రం సమయంలో చిన్నారులు, పలువురు విద్యార్థులు సమీపంలో ఉండే గ్రంథాలయానికి వచ్చి దాదాపు అరగంట నుంచి గంటసేపు తమకు ఇష్టమైన పుస్తకాలు చదువుతున్నారు. కొత్తగా వచ్చిన పుస్తకాల్లో కథల పుస్తకాలతో పాటు పోటీపరీక్షల పుస్తకాలు, పాలిటెక్నిక్, ఎంసెట్, లాసెట్, వంటి ప్రవేశ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు ఆధ్యాత్మికం, వినోదం పంచే పుస్తకాలు ఉన్నాయి.

> **సెలవులను సద్వినియోగం చేసుకోవాలి**
>
> 
>
> గ్రంథాలయంలో వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఏటా లాగే ఈ ఏడాది నిర్వహణకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ షెడ్యూల్ విడుదల చేస్తోంది. ఇచ్చిన టేమ్ టేబుల్ ప్రకారం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తాం. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థుల వివరాలు, సెల్ నెంబర్లు సేకరించాము. వేసవి శిబిరానికి అనుమతులు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం.
>
> – ములంపాక శ్రీనివాసరావు, లేబ్రేరియన్, గాంధీనగర్

24 నుంచి బాలభవన్‌లో వేసవి శిక్షణ

బోట్‌క్లబ్: స్థానిక గాంధీనగర్ చిల్డ్రన్‌పార్కు ఆవరణలోని బాలభవన్‌లో వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు ఈ నెల 24 నుంచి జూన్ 5 వరకూ జరుగుతాయని బాలభవన్ పర్యవేక్షకురాలు శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాత్రం, వయోలిన్, మృదంగం, కరాటేలో శిక్షణ ఇవ్వనున్నట్టు ఆమె తెలిపారు. ఉదయం 7. 30 నుంచి 10.30 వరకూ, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శుక్రవారం, రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ తరగతులు జరుగుతాయన్నారు. వేసవి ఎండలు తీవ్రత దృష్ట్యా కరాటే తరగతులు ఉదయం 6 గంటలకే ప్రారంభమవుతాయన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కోసం, సాంస్కృతిక అంశాల్లో పరిచయం చేసే విధంగా బాలభవన్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 95500 07974 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

తుప్పలు తొలగించండి

అధికారులకు ఎస్పీ ఆదేశం



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: జనసంచారం తక్కువగా ఉండే ప్రదేశాల్లో తక్షణమే తుప్పలు తొలగించాలని పోలీసు అధికారులను ఎస్పీ బిందుమాధవ్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. తుప్పలను తొలగించడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చునన్నారు. వీటిని గుర్తించేందుకు డ్రోన్లను వినియోగించుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించండి

ఎంఈఓ బుల్లి కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బుల్లికృష్ణవేణి

కరప: తల్లిదండ్రులు తమపిల్లలను లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేటు పాఠశాలల్లో చదివించే కన్నా, అన్ని వసతులు కల్పించి, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి అన్నారు. స్థానిక నక్కావారి ఎస్సీ వీధిలోని మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన పాఠశాల వార్షికోత్సవ సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదవర్గాల వారికి చదువు భారం కారాదని ప్రభుత్వం మోడల్ స్కూల్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, స్కూల్‌బ్యాగ్‌లు, టై, షూస్, బెల్టులు అందిస్తున్నట్టు తెలిపారు. పోషకవిలువలతో కూడిన మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువు ఆర్థిక భారమవుతోందన్నారు. ఒక్కసారి ఆలోచించి తల్లిదండ్రులు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ కోరారు. హెచ్ఎం వీణాధరి మాట్లాడుతూ పాఠశాల ప్రగతిని, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయిని దేగల లక్ష్మితో కలసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరచి వచ్చే విద్యాసంవత్సరానికి 22 మంది విద్యార్థులను కొత్తగా పాఠశాలలో చేర్పించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు నాగదేవి, సభ్యులు లక్ష్మి, సాదే వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కార భారతి కార్యవర్గం ఎన్నిక



సంస్కార భారతి నూతన కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: కళారాధన భూతాపాన్ని తగ్గిస్తుందని సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సాయి లక్ష్మి తెలిపారు. స్థానిక రంగయ్యానాయుడు వీధిలో మంగళవారం సంస్కారభారతి ఆధ్వర్యంలో ధరిత్రీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కార భారతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆమె ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఆకొండి శ్రీనివాసరాజారావు, ఉపాధ్యక్షుడిగా ఓలేటి మూర్తి, వెంకటేష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి ఆనెం ప్రసాద్, కార్యదర్శి గునుపూడి సావిత్రి, కోశాధికారిగా హేజీబు భానుమూర్తి, సభ్యులుగా చావలి సూర్యకుమారి, బచ్చల మల్లికార్జునరావు, అల్లం కృష్ణమూర్తి, కోట జగన్నాథశర్మ, తాతపూడి ప్రసాదరావు ఎన్నికయ్యారు. సభ్యులను ప్రముఖ పంచాంగకర్త సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి అభినందించారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ షణ్మోహన్
- పోషకాహార పక్షోత్సవాలపై సమీక్ష



సీమంతాలు అయిన గర్భిణులతో కలెక్టర్ షణ్మోహన్, ఇతర అధికారులు

కాకినాడ సిటీ: మహిళలు గర్భధారణ సమయం నుంచి మొదటి వెయ్యి రోజుల సంరక్షణపై పూర్తి శ్రద్ధ వహించాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార పక్షోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గర్భధారణ సమయంలో మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని, కనీసం నాలుగుసార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల లోపు తీసుకోవలసిన జాగ్రత్తలు చాలా ముఖ్యమైనవని, అందులో బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని ఆయన సూచించారు. పుట్టిన వెంటనే బిడ్డకు బీసీజీ, ఓపీవీ హెపటైటిస్-బి టీకాలు వేయించాలని కలెక్టర్ వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయకుమారి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు వివిధ శాఖల సమన్వయంతో గ్రామ, పట్టణ, వార్డుల్లో అలాగే ప్రతి పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ పక్షోత్సవం ముఖ్య ఉద్దేశం అన్ని సాంఘిక వర్గాల ప్రజలందరికీ సరైన పోషణ జీవిత కాలంలోని మొదటి వెయ్యి రోజుల ప్రాముఖ్యత, పోషకాహారం, విద్య, వృద్ధి పర్యవేక్షణ, పరిపూర్ణకరమైన ఆహారం తదితర అంశాలపై అవగాహన కల్పించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని విజయకుమారి కోరారు. ఇందులో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖలు సమన్వయంతో జిల్లా స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. జిల్లా వైద్యాధికారి జె.నరసింహనాయక్ మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డ 2.5 కేజీలు ఉండాలన్నారు. తల్లి సరైన పోషకాహారం తీసుకోకపోయినట్లయితే తక్కువ బరువుతో పిల్లలు పుట్టి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. బిడ్డ వయసును బట్టి ఎత్తు, బరువు ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో 13 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంపై టి.యువచంద్ర బృందం కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కేవీ సుబ్బరాజు, సమాచారశాఖ డీడీ డి నాగార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ స్వర్ణలత, సీడీపీవో టీడీఆర్ పద్మావతి, డీఆర్‌డీఏ ఏపీఎం అనిల్‌కుమార్, జిల్లాలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై నిరంతర అవగాహన

- డీఆర్వో వెంకటరావు
- రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష



ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై నిరంతరం అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అవకాశం ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. మంగళవారం జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ముందుగానే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, మార్పులు, చేర్పులు, తొలగింపు, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు వంటి అంశాలపై చర్యలకు భారత ఎన్నికల సంఘం ప్రతిపాదనలు కోరిందన్నారు. ఈ నేపథ్యంలో తప్పులు లేని ఓటరు జాబితా తాయారీ, పోలింగ్ కేంద్రాల తరలింపు, నూతన కేంద్రాల ప్రతిపాదన, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18–19 ఏళ్ల యువత ఓటు నమోదు వంటి అంశాలపై సూచనలు, సలహాలు అందించాలని డీఆర్వో రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లను తప్పనిసరిగా నియమించాలన్నారు. జిల్లా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న 1640 పోలింగ్ కేంద్రాల్లో 16,37,638 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 1000–1200 మంది ఓటర్లు 581 పోలింగ్ కేంద్రాల్లోనూ, 1200 పైన ఓటర్లు 283 పోలింగ్ కేంద్రాల్లో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 800-1200 మంది ఓటర్ల ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించనున్నట్టు తెలిపారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైనన్ని వసతుల కల్పనకు చర్యలు తసుకుంటామని డీఆర్వో తెలిపారు. జిల్లాలో 18–19 సంవత్సరాల యువత ఓటు నమోదు శాతాన్ని పెంచేందుకు డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ సమయంలోనే విద్యార్థులతో ఓటు నమోదు ప్రక్రియ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో ఎన్నికల విభాగం డీటీ ఎం జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా, ఆర్.వెంకటేశ్వరరావు, ఎస్.అప్పారావు, బి.జయప్రకాష్, సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుడమిని రక్షించుకుందాం

- పర్యావరణవేత్త ప్రొఫెసర్ మురళీకృష్ణ
- ఘనంగా ధరిత్రి దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీకృష్ణ

కాకినాడ రూరల్: కాలుష్య కోరల నుంచి పుడమిని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతను గుర్తెరిగి సంప్రదాయ ఇంధనాలకు బదులు పునరుత్పాదక ఇంధనాలను వినియోగించాలని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కేవీఎస్‌జీఎన్ మురళీకృష్ణ పిలుపునిచ్చారు కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ధరిత్రి రక్షిత సమితి సంయుక్త ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ధరిత్రి రక్షిత సమితి సభ్యుడు కృష్ణమోహన్ అధ్యక్షత వహించగా పర్యావరణవేత్త మురళీకృష్ణ ముఖ్య అతిథిగా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ. శ్రీరామచంద్రమూర్తి విశిష్ట అతిథిగా, ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సురేఖ గౌరవ అతిథిగా పాల్గొని ధరిత్రి దినోత్సవ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఏఎస్ఆర్‌సీ మూర్తి, ఓఎన్‌జీసీ ప్రతినిధులు, ధరిత్రి రక్షిత సమితి సభ్యులు కృష్ణమోహన్, నరసింగరావు, బాబీ, పీసీబీ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

బాలాజీచెరువు: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణన్ అధ్యక్షుడు యాళ్ల రత్నారావు పేర్కొన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణతో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రత్నారావు మాట్లాడుతూ సకల జీవాలకు ఆధారమైన భూమిని కాపాడుకోవడం అందరికీ అవసరమని, ప్లాసిక్ట్ వినియోగాన్ని తగ్గించి భూ కాలుష్యం నుంచి రక్షించాలన్నారు. భావి తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్ మునిరెడ్డి, రవిశంకర్ పట్నాయక్, దిలీప్‌కుమార్ సదానాని పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో

కాకినాడ రూరల్: రమణయ్యపేట అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి రక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భూతాపం వల్ల జీవరాశి మనుగడకు ముప్పు ముంచుకొస్తోందని ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు అన్నారు. న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ దట్టమైన అడవులను నరికి వేయడం, సహజ నిక్షేపాలను తవ్వడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందన్నారు. విలువైన భూ వనరులను పొదుపుగా వినియోగిస్తూ భావి తరాలకు అందించాలన్నారు. అనంతరం గుడ్డ సంచులను పంపిణీ చేశారు.



ఎన్టీఆర్ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న క్లబ్ సభ్యులు



గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

రెండు నెలల్లో 80 వేల సోలార్ కనెక్షన్లు

- కలెక్టర్ షణ్మోహన్
- పీఎం సూర్యఘర్‌పై శిక్షణ

సామర్లకోట: జిల్లాలో ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు వినియోగించుకునేలా జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, డీఆర్‌డీఏ సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. పీఎం సూర్యఘర్ యోజనపై జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, డీఆర్‌డీఏ సిబ్బందికి స్థానిక టీటీడీసీలో మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా మహిళా సమాఖ్యలోని ప్రతి సభ్యురాలూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని సబ్సిడీ పొందాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలోవాట్ల వరకూ ఉచితంగా అందజేస్తారన్నారు. స్లాబ్, పెంకులు, రేకుల ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. పూరిల్లు అయితే, అక్కడి ఖాళీ స్థలంలో దీనిని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. వర్షాలు ప్రారంభమయ్యే నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రెండు నెలల్లో 80 వేల కనెక్షన్లు పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు. మహిళా సంఘాల్లో స్త్రీ నిధి బ్యాంకు నుంచి రుణ బకాయిలు లేని వారికి సులభంగా రుణం అందుతుందని చెప్పారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా లేని వారికి కూడా బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలివ్వడానికి ముందుకు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్ మాట్లాడుతూ, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు ద్వారా ఆదాయం కూడా పొందవచ్చన్నారు. యూనిట్‌లో 50 శాతం సబ్సిడీ ఇస్తారని, ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లు ఆ పైన రూ.78 వేల చొప్పున సబ్సిడీ లభిస్తుందని వివరించారు. ఒక కిలోవాట్‌కు ఏడాదికి రూ.8 వేలు, రెండు కిలోవాట్లకు రూ.20 వేలు, మూడు కిలోవాట్లకు రూ.32 వేల వరకూ ఆదాయం లభిస్తుందని చెప్పారు. లబ్ధిదారులు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్తును ఏపీఈపీడీఎల్ కొనుగోలు చేసి, ప్రతి నెలా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్, ఏడీఈ కిరణ్, ఏఈ రమేష్ కుమార్, వెలుగు డీపీఎంలు వెంకటేశ్వరరావు, బాబూరావు, జిలానీ, రాయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలపై అవగాహన అవసరం

సామర్లకోట: రైతు సేవా కేంద్రాపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజరు ఎం.దేవులానాయక్ అన్నారు. మండల పరిధిలో ఉండూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించాలంటే రైతు సేవా కేంద్రాల ద్వారానే విక్రయించాలని సూచించారు. 75 కిలోల సాధారణ రకానికి రూ.1725, గ్రేడ్-ఎ రకానికి రూ.1740 ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. మిల్లులో ధాన్యం అన్‌లోడ్ అయిన 48 గంటలలో రైతుల బ్యాంకు ఖాతాలలో సొమ్ము జమ అవుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు దళారులు, మధ్యవర్తులపై ఆధారపడి మోస పోవద్దన్నారు. ప్రతి మిల్లుకు రోజు వారి పరిమితి విధించడం వల్ల ధాన్యం విక్రయించడానికి ఆలస్యం అవుతుందని, ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల ఫిర్యాదులపై స్పందించిన డీఎం బుధవారం నుంచే రోజు వారి పరిమితిని తొలగిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఎంవీ సతీష్, శాంతి కమల, వీపీఏ తేజస్విని, రైతులు పాల్గొన్నారు.